క్లుప్తంగా

10న భక్తిసంగీత కార్యక్రమం

తెనాలి: పట్టణ నాజరుపేటలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి జయంతి సందర్భంగా ఈనెల 10వ తేదీన భక్తిసంగీత కార్యక్రమాన్ని జరపనున్నారు. రామలింగేశ్వర పేటకు చెందిన శ్రీలక్ష్మీశారద సంగీత ఆలయం శిష్యబృందంచే ఆరోజు సాయంత్రం ఆరు గంటల్నుంచి ఎనిమిది గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు గౌరావఝుల ఆంజనేయశాస్త్రి వయొలిన్‌పై, కేవీ రామకృష్ణ మృదంగంపై నల్లపాటి వెంకటేశ్వరరావు కీ బోర్డుతో సహకరిస్తారని వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

పాఠశాలలో ప్రవేశాలకు మున్సిపల్ హైస్కూలు ఉపాధ్యాయుల ప్రచారం



తెనాలి: పట్టణ అయితానగర్‌లోని ఎన్‌ఎస్‌ఎస్ మున్సిపల్ హైస్కూలులో విద్యార్థుల ప్రవేశాలకు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో ఎన్‌ఎస్‌ఎస్ మున్సిపల్ హైస్కూలు మున్సిపల్ హైస్కూల్స్‌లో రెండోస్థానంలో నిలిచింది. 13 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించగా, ఒకరు అత్యధికంగా 583 మార్కులు కైవసం చేసుకున్నట్టు గుర్తుచేశారు. ఈ వివరాలను తెలియజేస్తూ ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ మైక్ రిక్షాలో వివరాలను వినిపించారు. ఎస్ఎంసీ చైర్మన్ గాలి కిరణ్, హరినాథ్, ఉపాధ్యాయులు ప్రసాద్, రాజకిషోర్, బసవేశ్వరరావు, బెల్లకొండ వెంకట్ పాల్గొన్నారు.

నేడు తెనాలిలో దివ్యాంగుల పరికరాల గుర్తింపు శిబిరం

తెనాలిఅర్బన్: కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు పంపిణీ చేసే పరికరాల గుర్తింపు శిబిరాన్ని గురువారం తెనాలిలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. చేతికర్రలు, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిల్‌లు, రోల్‌టైర్స్, అంధుల చేతికర్ర, లెప్రెసి కిట్స్, కృత్రిమ అవయవాలు మొదలగు వాటిని ప్రభుత్వం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. దీనిలో భాగంగా తెనాలిలో దివ్యాంగులకు పరీక్షలు జరిపి అవసరమైన పరికరాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. క్యాంప్‌కు వచ్చే సమయంలో సదరమ్ సర్టిఫికెట్, తెల్లరేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, యూనిక్ డిజైబుల్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు, సెల్ ఫోన్ తెచ్చుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని తెనాలి నియోజకవర్గ పరిధిలో ఉన్న దివ్యాంగులు ఉపయోగించుకోవాలన్నారు.

ఉగ్రవాద స్థావరాలపై దాడులకు హర్షం



తెనాలి: హిందూ చైతన్య వేదిక, తెనాలి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక గాంధీ చౌక్‌లో విజయోత్సవ సంబరాలను చేశారు. ఏప్రిల్ 22వ తేదీన కశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఇస్లామిక్ ఉగ్రవాదుల దాడిలో భర్తలను కోల్పోయిన భార్యల నుదుట సింధూరం సాక్షిగా భారత వైమానిక దళం పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై చేసిన దాడిని సమస్త భారత సమాజం హర్షిస్తుందని పేర్కొన్నారు. భారత త్రివిధ దళాలకు సెల్యూట్ చేస్తున్నామని తెలిపారు. ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని, ఇకపై పాకిస్తాన్ ఉగ్రవాదులు తోక జాడిస్తే ఈ భూమిపై పాకిస్తాన్‌ను లేకుండా చేస్తామని ప్రధాన మోదీ ప్రతిజ్ఞ చేసినందుకు గర్విస్తున్నామని తెలిపారు. భారత్ మాతాకీ జై...అని నినాదాలు చేశారు. కఠారి వాసుదేవనాయుడు, త్రిపురమల్లు హనుప్రసాద్, పరుచూరు రాజేష్, అడపా సంపత్‌రాయుడు, రఘు, అంబటి మారుతీరామ్, పొట్టి మూర్తి, లక్ష్మీశ్రీనివాస్, తాడేపల్లి మూర్తి, కొల్లూరు సంతోష్, సునీల్, టీవీ రమణ పాల్గొన్నారు.

ముగిసిన రామాయణ యజ్ఞం

తెనాలి రూరల్ : మండలంలోని అంగలకుదురులో గల ఆంధ్ర వాల్మీకి శ్రీ వాసుదాస, దాసశేష స్వామి వార్ల పరంపర పీఠం దాసుకుటి ఆశ్రమంలో జరుగుతున్న రామాయణ యజ్ఞం బుధవారంతో ముగిసింది. గత నెల 28 నుండి జరుగుతున్న కార్యక్రమంలో శ్రీ సీతారామ స్వామి వారికి వార్షిక 68వ లక్ష మల్లెపూలు పూజల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వాల్మీకి రామాయణం బాలకాండ నుంచి యుద్ధకాండ పట్టాభిషేకం వరకు పది రోజులు యజ్ఞం పూర్తయి పూర్ణాహుతి బుధవారం విశేషంగా నిర్వహించారు. షష్టమ పీఠాధిపతి సీతారామదాసు స్వామి పర్యవేక్షించారు.

ఈ రహదారిలో ప్రయాణం నరకమే..!

- అధ్వానంగా ఇసుకపల్లి-సజ్జావారిపాలెం రోడ్డు
- మూడు కిలోమీటర్ల మేర తవ్వి వదిలేసిన రహదారి
- మరమ్మతులు చేయాలని కోరుతున్న ప్రయాణికులు



ఇసుకపల్లి నుంచి సజ్జావారిపాలెం వరకు తవ్వి వదిలేసిన రహదారి

రేపల్లె : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు సంవత్సరం గడుస్తున్నా నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంది. సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులు నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్భాటంగా ప్రకటించిన అమలుకు నోచుకోలేదు.

- పాలకుల నిర్లక్ష్యం అధికారుల అలసత్వం ప్రయాణికుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారుల్లో సైతం మరమ్మతులు నిర్వహించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సాక్షాత్తు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్న రేపల్లె నియోజకవర్గంలో రహదారులు దారుణంగా ఉన్నాయి. కనీసం రహదారులకు మరమ్మతులు నిర్వహించక పోవడంతో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతంగా మారాయి.
- ముఖ్యంగా రేపల్లె నుంచి నగరం వెళ్లే ప్రధాన రహదారిలో ఇసుకపల్లి నుంచి సజ్జవారి పాలెం వరకు రహదారి మరమ్మతులు చేసేందుకు రెండు నెలల క్రితం మూడు కిలోమీటర్ల మేర రహదారిని తవ్వి వదిలేశారు. రహదారిని తవ్వి వదిలేయటం వల్ల పెద్ద పెద్ద గులకరాళ్లు బయటపడి ఈ రహదారిలో ప్రయాణం నరక యాతనగా మారింది. దీంతో పాటు రహదారిలో వాహనాలు వచ్చి వెళ్లే సమయంలో లేస్తున్న దుమ్ముతో వెనక వచ్చే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- పెద్ద పెద్ద గులకరాళ్లు పైకి లేచి ఉండటం వల్ల పలు సందర్భాలలో ద్విచక్ర వాహనాలు జారీ ప్రమాదాలకు గురవడంతో వాహన చోదకులు గాయాల పాలవుతున్నారు. రేపల్లె నుంచి నగరం, నిజాంపట్నం జిల్లా కేంద్రమైన బాపట్ల, గుంటూరులకు చేరుకోవాలంటే ఈ రహదారి ప్రధాన మార్గం కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే రహదారిని నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రజలు, ప్రయాణికులు పెదవి విరిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలి

తహసీల్దారు నెహ్రూ బాబు



వీఆర్వోలతో సమావేశంలో తహసీల్దారు నెహ్రూ బాబు

అమర్తలూరు(వేమూరు): తహసీల్దారు కార్యాలయంలో బుధవారం సాయంత్రం గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు నెహ్రూ బాబు మాట్లాడుతూ అర్హులైన కుటుంబాలకు రైస్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలని సూచించారు. అదే విధంగా ఖరీఫ్ సీజన్‌లో కౌలు రైతులకు కార్డులు, ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు, రీ సర్వే కార్యక్రమాలు అన్నీ వేగవంతం చేయాలని చెప్పారు. వీఆర్వోలు నిర్లక్ష్యం చేయరాదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శివయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు

నిజాంపట్నం: మండలంలోని బొర్రావారి పాలెం గ్రామంలో వేంచేసియున్న అంకమ్మ తల్లి ఆలయ 8వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

అల్లూరి పోరాట పటిమ ఆదర్శం



ఖాజీపాలెంలో సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పించిన క్షత్రియులు



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ ఆదర్శవంతమైనదని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిబ్బందితో కలసి ఎంపీడీవో పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్య వాదుల్ని ఎదిరించిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రజని, పంచాయతీ కార్యదర్శి వీరాస్వామిరెడ్డి తదితరులు ఉన్నారు. కర్లపాలెం పాలకేంద్రం వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భూపతిరావు, జనసేన మండల అధ్యక్షుడు శ్రీకృష్ణ, క్షత్రియ సంఘం సభ్యులు హరనాధరాజు, వెంకటరామరాజు, బలరామరాజు, రామరాజు, సత్యంరాజు, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఖాజీపాలెం(కర్లపాలెం): రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని క్షత్రియ సమితి నాయకులు మంతెన కృష్ణమూర్తిరాజు చెప్పారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం ఖాజీపాలెంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి క్షత్రియ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శివాజీరాజు, వెంకటేశ్వరరాజు తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి ఆలపాటి ధర్మారావుకు నివాళి



వేమూరు: మాజీ మంత్రి ఆలపాటి ధర్మారావు చేసిన సేవలు మరువలేమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దాది సుబ్బారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గంలో ఆలపాటి ధర్మారావు ప్రజలకు అనేక సేవలు అందించడం జరిగిందని ఆయన చెప్పారు. బుధవారం ఆయన వర్ధంతి నిర్వహించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొల్లిశెట్టి ప్రభాకరరావు, దున్నా మేరీసుబాబు, పట్టిల రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

పినపాడు చెరువు అభివృద్ధికి చర్యలు



చెరువును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న



రాజీవ్ గృహ కల్ప సముదాయాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: పినపాడులోని చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పినపాడులోని చెరువును బుధవారం ఆమె పరిశీలించారు. చెరువులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈసందర్భంగా కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ రూ.32 లక్షలతో రివీటింగ్, రూ.10 లక్షలతో ఫెన్సింగ్ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. వీటిని సోమవారం ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, ఎఈ సునీల్ పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు కాలనీలోని రాజీవ్ గృహ కల్పను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పరిశీలించారు. అండర్ గ్రౌండ్ సెప్టిక్ డ్రయినేజ్, అంతర్గత మురుగునీటి వ్యవస్థ కూడా పాడైపోవటంతో దానిని బాగు చేయించాలని కౌన్సిలర్ పెదలంక లక్ష్మిలావణ్య కోరారు. దీనిపై స్పందించిన అధికారులు అక్కడి వచ్చి దానికి సంబంధించిన డిజైన్లు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



బాపట్లటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి పిట్టలవానిపాలెం మండలం, రెడ్డిపాలెం సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే చీరాల టౌన్, గంజిపాలెంకు చెందిన షేక్ బాజీ (29) టైల్స్ మేస్త్రిగా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి 9.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై చీరాల నుంచి రేపల్లె వైపు వెళ్తున్నాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో రెడ్డిపాలెం టోల్‌గేట్ సమీపంలో ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం ఢీ కొట్టడంతో తీవ్రగాయాలతో కుప్పకూలాడు. స్థానికుల సమాచారం మేరకు హైవే అథారిటీ అంబులెన్సులో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు దుబాయ్ నుంచి ఏడాది క్రితమే చీరాలకు వచ్చాడు. కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉన్న కుమారుడు మృత్యువాత పడటంతో మృతుడి తల్లిదండ్రులు, బంధువులు ఏరియా వైద్యశాల వద్ద రోధిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఈ మేరకు వైద్యశాల అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

20న సార్వత్రిక సమ్మెలో 'మేము సైతం'

సమ్మె నోటీసును అందజేసిన సీఐటీయూ అనుబంధ హమాలీ, కార్మిక సంఘాల నేతలు



సహాయ కార్యదర్శికి సమ్మె నోటీసు ఇస్తున్న నేతలు

తెనాలి: కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్టు సీఐటీయూ అనుబంధ హమాలీ, కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. ఆ ప్రకారం కార్మిక సంఘాల నాయకులు వివిధ ప్రభుత్వశాఖల అధికారులకు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలనీ, ఇంతకుముందు రద్దుచేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలనీ, జాతీయస్థాయిలో కనీసవేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్న సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలి తెలియజేశారు. అంతేకాకుండా కాజువల్, కాంట్రాక్టు, ఔట్‌సోర్స్, పీస్‌రేట్ పనివిధానాన్ని రద్దుచేయాలనీ, పెరుగుతున్న ధరలను అదుపుచేయాలనీ, ఈఎస్‌ఐ చట్టాలన్నీ అమలు చేయాలని కార్మికసంఘాలు కోరుతున్నట్టు వెల్లడించారు. సమ్మె నోటీసును స్థానిక చెంచుపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సహాయ కార్యదర్శికి షేక్ హుస్సేన్‌తోపాటు సీఐటీయూ నాయకుడు కేబీ ప్రసాద్, హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సీహెచ్ ఆంజనేయులు అందజేశారు. ఏపీ సివిల్ సప్లయిస్, వేర్‌హౌస్, గోడౌన్ ఇన్‌చార్జికి హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.వెంకటరావు, సంగమేశ్వరరావు, షేక్ హుస్సేన్‌వలి సమ్మె నోటీసును ఇచ్చారు. అలాగే ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్, తెనాలి డివిజన్ మేనేజరుకూ సమ్మె నోటీసును అందించారు.

వైఎస్సార్‌సీపీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేలా కమిటీలు

పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



ఎంపీ వైవీ సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న డాక్టర్ గణేష్

రేపల్లె: వైఎస్సార్‌సీపీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేలా సమర్ధవంతమైన నాయకులను నియమించినట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వకర్త డాక్టర్ ఈవూరు గణేష్ చెప్పారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కలిసి నియోజకవర్గ రాజకీయ స్థితిగతులను వివరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి కమిటీలను, పార్టీ అనుబంధ విభాగాల కమిటీలను నియమించటం జరిగిందన్నారు. ప్రభుత్వ అసమర్థతను, వ్యతిరేక విధానాలను నిత్యం ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రచించినట్లు తెలిపారు. ప్రతి రోజు మండల, గ్రామ స్థాయి కమిటీ నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ బలోపేతంకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా వీర బ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల



యాజలిలో గ్రామోత్సవానికి వచ్చిన వీర బ్రహ్మేంద్రస్వామి మొక్కుబడి జెండా



వలివేరులో అన్నదాన కార్యక్రమంలో భక్తులు

కర్లపాలెం: మండల పరిధిలోని యాజలి గ్రామంలో వేంచేసియున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల బుధవారం వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ మొక్కుబడి జెండాలు ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో ఉంచి మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు స్వామి వారి జెండాకు వడపప్పు, టెంకాయలు సమర్పించి హారతులిచ్చారు. గ్రామంలోని భక్తులు స్వామి వారి ఆలయానికి చేరుకుని స్వామివారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి పూలు, పండ్లు సమర్పించి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడిసె బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

చుండూరు(వేమూరు): వీర బ్రహ్మేంద్ర స్వామిని ఆరాధించాలని ఆలయ కమిటీ నిర్వాహకులు షేక్ హుస్సేన్ అన్నారు. చుండూరు మండలంలోని వలివేరు, మండూరు, దుండిపాలెం గ్రామాల్లో బుధవారం వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వలివేరు గ్రామంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వీర బ్రహ్మేంద్ర స్వామి విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేరంటాలమ్మ తిరునాళ్లకు అంకురార్పణ



పేరంటాలమ్మ ఆలయం

తెనాలి: పట్టణ అయితానగర్‌లో గౌరమ్మ-వెంకయ్యల దేవాలయంలో పేరంటాళ్లమ్మ తిరునాళ్ల వైభవంగా ఆరంభమైంది. భక్తబృందం ఆధ్వర్యంలో జరిగే తిరునాళ్లను బుధవారం సాయంత్రం అఖండ దీపారాధనతో అంకురార్పణ చేశారు. నాలుగురోజులపాటు అంగరంగ వైభవంగా వేడుకలు జరగనున్నాయి. 8న ప్రతిమల ఊరేగింపు, 9న తేదీ సాయంత్రం గుమ్మడి శిడి, 10న జలబిందెలు, పాపవేషధారణ, పూలకప్పెర జరుగుతాయి. చివరిరోజైన ఈనెల 11న మధ్యాహ్నం నుండి పొంగళ్లు, మొక్కుబడులు (అడుగులు-మడుగులు), గండదీపాలు, పసుపు బళ్లు, కరెంటు ప్రభలు, మేక శిడి వంటి సంప్రదాయ వేడుకలు, సాంస్కృతిక ప్రదర్శనలను ఘనంగా నిర్వహిస్తారు. అయితానగర్‌కు చెందినవారే కాకుండా ఎక్కడెక్కడో స్థిరపడ్డ ఆ గ్రామవాసులు తిరునాళ్లలో పాల్గొంటారు. మొక్కులు మొక్కుకోవటం, కోర్కెలు నెరవేరినవారు తీర్చుకోవటం ఆనవాయితి.

200 ఏళ్లకు పైగా చరిత్ర!

ఈ ఆలయం, ఉత్సవం వెనుక 200 ఏళ్లకు పైగా అనుశ్రుత చరిత్ర ఉంది. ఆ కాలంలో తెనాలి ప్రాంతాన్ని ముస్లింరాజులు పరిపాలిస్తున్నారు. ఉన్నతాధికారి ఒకరు తహశీల్దారుగా, అయితానగర్‌కు మునసబు, మోతాదులు, వెట్టివారు ఉండేవారు. తెనాలికి 23 కిలోమీటర్ల దూరంలోని కొల్లూరులో జన్మించిన పోటూరి గౌరమ్మ పెద్దబాలశిక్ష చదువుకుంది. అల్లారుముద్దుగా పెరిగిన తనను అయితానగరప్పాడు (నేటి అయితానగర్) నివాసి కన్నెగంటి వెంకయ్యకు ఇచ్చి పెళ్లి చేశారు. వీరి దాంపత్యజీవనంలో ఒక ఆడపిల్ల జన్మించింది. మళ్లీ కొన్నేళ్లకు గౌరమ్మ గర్భం దాల్చింది. ఒకరోజు చింతతోపులో పశువులను మేపుతున్న వెంకయ్య, చింతచిగురు తీసుకెళ్లి భార్యకు పులుపు తినిపించాలని తలపోశాడు. చింతచెట్టు ఎక్కి, పట్టుతప్పి కిందపడి మృతిచెందాడు.

తెనాలి ప్రాంతంలో తొలి సహగమనం...

గ్రామస్తులు తీసుకొచ్చిన వెంకయ్య మృతదేహంపై పడి గౌరమ్మ విలపించింది. భర్త లేని జీవితం వ్యర్థమని నిర్ణయించుకొన్న గౌరమ్మ, భర్తతోపాటు తాను సహగమనం చేస్తానంటూ ప్రకటించింది. మునసబు, మోతాదుల ద్వారా విషయం తెలుసుకున్న తహసీల్దారు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. గౌరమ్మ సతీసహగమనాన్ని నిరోధించేందుకు ప్రయత్నించారు. అప్పటికే పేర్చి పెట్టిన చితిపై ఉంచి వెంకయ్యకు నిప్పంటించగా, కణకణమండే చితిలో నిర్భయంగా గౌరమ్మ సహగమనం చేసింది. చితిలో రగులుతూ తనకు అదేచోట గుడి కట్టించాలనీ, తన కుమార్తెను స్నేహితురాలి కుమారుడుకిచ్చి వివాహం చేయాలని కోరిందట గౌరమ్మ. తాను, తన భర్త శిలలుగా వెలుస్తామనీ, గ్రామానికి రక్షణగా ఉంటామని, కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని చెప్పింది.

గౌరమ్మని కొలిస్తే...

ఆ చితి ప్రదేశంలోనే కొన్నాళ్లకు గౌరమ్మ-వెంకయ్య శిలలు వెలిశాయి. పూరిపాక వేసి, గ్రామస్తులు పూజలు చేయటం ఆరంభించారు. అప్పట్లో కలరా, మశూచి, పొంగు జ్వరాలు విపరీతంగా వుండేవి. గౌరమ్మని కొలిస్తే వాటిని నివారించిందని అయితానగర్ ప్రజల విశ్వాసం. గుడి బాధ్యతలు చూస్తుండే మునసబుకు కలలో కనిపించిన గౌరమ్మ, వైశాఖ ఏకాదశి రోజున అఖండ దీపారాధనతో ఉత్సవాన్ని ప్రారంభించి, నాలుగురోజులు ఎలా నిర్వహించాలనేది ఆదేశించినట్టు చెబుతారు. అప్పట్నుంచి వైశాఖ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు వేడుకగా నిర్వహిస్తున్నారు. ఆలయానికి పూరిపాక స్థానంలో 1894లో ఇటుకలతో శ్లాబు వేశారు. అదే ఏడాది కొలకలూరు నుంచి అంకమ్మ విగ్రహం అన్నాబత్తుని రామయ్యకు లభ్యంకాగా దానిని ఆలయ దక్షిణ భాగంలో ప్రతిష్ఠించారు. తర్వాత కాంక్రీటు శ్లాబు వేయించారు. గోపుర శిఖరం ఏర్పాటుచేశారు. ముఖమండపం విశాలపరచి, గుడిచుట్టూ ఇనుప గ్రిల్స్ వేశారు. నాపరాయి పరిచారు. కొంతభాగం మొజాయిక్ ఫ్లోర్ చేశారు. విద్యుత్ సౌకర్యం కల్పించారు. తిరునాళ్లలో అయితానగర్ వాసులు పెద్దసంఖ్యలో పాల్గొంటారు. గుమ్మడి శిడి, మేక శిడి లాగేందుకు యువకులు పోటీపడుతుంటారు. మానులాగుటం వల్ల వివాహమవుతుందని జనం నమ్మిక. మేకశిడిని తాకితే మంచి జరుగుతుందని విశ్వసిస్తారు. తిరునాళ్ల రోజుల్లో ఆ ప్రాంతంలో గుడికి వెళ్లని వారు దాదాపు ఉండరు. అయితానగర్ వాసులు దూరపు బంధువులను ఆహ్వానిస్తారు. అతిథి మర్యాదలు చేస్తారని నాల్గవ తరం వంశ పారంపర్య ధర్మకర్తలు కన్నెగంటి వెంకట రత్నప్రసాద్, కన్నెగంటి భాస్కరరావు చెప్పారు.

సీపీఎం జెండా స్తంభం విరగ్గొట్టిన దుండగులు

తెనాలి: రూరల్ మండల గ్రామం గుడివాడలోని అంబేద్కర్ సెంటర్లోని సీపీఎం జెండా పోల్‌ను విరగ్గొట్టిన దుండగులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆ పార్టీ రూరల్ కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రముఖ స్వాతంత్ర్యయోధుడు, సీపీఎం పార్టీ అగ్రనాయకుడు ఏకే గోపాలన్ స్మారకార్థం నిర్మించిన స్థూపం వద్ద జెండా పోల్‌ను బుధవారం ఉదయం గుర్తు తెలియని దుండగులు విరగ్గొట్టి రోడ్డుపై పడేశారని ఆయన చెప్పారు. సీపీఎం పార్టీ స్థానిక సభ్యులు, సానుభూతిపరులతో కలిసి శివసాంబిరెడ్డి అక్కడకు వెళ్లారు. మే డే రోజున ఇద్దరు యువకులు మద్యం సేవించి అల్లరి చేశారని చెబుతూ, ఈ రోజు గుర్తుతెలియని వ్యక్తులు జెండాను అవమానించటం హేయమైన చర్యగా తెలిపారు. సీసీ కెమెరాలు పనిచేయకుండా చూసి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని స్థానికులు వివరించారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ చర్యను ఖండించాలని శివసాంబిరెడ్డి కోరారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకరరావు, బురదగుంట భాస్కరరావు, బండికళ్ల పసి తదితరులు పాల్గొన్నారు.

